బలగం BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ మంగళవారం 09 సెప్టెంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## నేడు ఉప రాష్ట్రపతి ఎన్నిక పోలింగ్

**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

దేశంలో రెండో అత్యున్నత పదవి అయిన ఉపరాష్ట్రపతి ఎన్నికకు సర్వం సిద్ధమైంది. ఉపరాష్ట్రపతిగా ఉన్న జగదీప్ ధన్కర్ జులై 21న అకస్మాత్తుగా చేసిన రాజీనామాతో ఈ ఎన్నికలు అనివార్యంగా మారిన విషయం విదితమే. దీంతో దాదాపు రెండేండ్ల పదవీకాలంలో మిగిలి ఉండగానే ఉపరాష్ట్రపతి ఎన్నికలు వచ్చాయి. ఈ పదవి కోసం బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ అభ్యర్థి, మహారాష్ట్ర ప్రస్తుత గవర్నర్ సి.పి రాధాకృష్ణన్, ప్రతిపక్ష పార్టీల ఉమ్మడి అభ్యర్థి, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి. సుదర్శన్‌రెడ్డిలు బరిలో నిలిచారు. మంగళవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పార్లమెంట్‌హౌస్‌లోని వసుధ రూమ్ నెంబర్ ఎఫ్ 101 లో పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికకు ఎలక్టోరల్ కాలేజీలో ఉన్న లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. సాయంత్రం 6 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది. అనంతరం ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.రహస్య బ్యాలెట్ విధానం కింద జరిగే ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో పార్లమెంట్ సభ్యులకు విప్ జారీ చేసే అవకాశం లేదు. సభ్యులు తమ ఇష్టపూర్వకంగా ఓటు వేసుకోవచ్చు. అందుకే ప్రతిపక్ష పార్టీల ఉమ్మడి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డి సభ్యులు ఆత్మప్రభోదానుసారం ఓటు వేయాలని కోరుతున్నారు.

# మూసీని ప్రక్షాళన చేస్తాం

## నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దుతాం




- హైదరాబాద్ ఫ్యాక్టరీల కాలుష్యం మూసీలో కలవకుండా నియంత్రిస్తాం.
- శ్రీపాద ఎల్లంపల్లి నుంచే గోదావరి జలాల తరలింపు
- హైదరాబాద్ నగర ప్రజల దాహార్తిని తీర్చేందుకే గోదావరి తాగునీటి సరఫరా పథకం
- కడుపులో విషం పెట్టుకొని ప్రాజెక్టులు ఆపకండి
- గోదావరి ఫేజ్-2,3 పనుల శంకుస్థాపనలో సీఎం రేవంత్‌రెడ్డి
- కోకాపేటలో ట్రంపెట్ జంక్షన్ ప్రారంభోత్సవం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

రాబోయే పదేళ్లలో హైదరాబాద్‌ను అద్భుతమైన నగరంగా తీర్చిదిద్దడమే కాకుండా లక్షలాది మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ప్రకటించారు. ఈ మహానగరాన్ని అభివృద్ధి చేయడంలో ప్రతి ఒక్కరూ అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టు నిర్వాసితులు అందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని స్పష్టం చేశారు.

గోదావరి తాగునీటి సరఫరా పథకం (ఫేజ్ II & III), ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలను నింపడం ద్వారా మూసీ నది పునరుజ్జీవం పథకానికి గండిపేట వద్ద ముఖ్యమంత్రి గారు శంకుస్థాపన చేశారు. దాదాపు 7,360 కోట్ల వ్యయంతో రెండేళ్లలో పూర్తి చేయాలన్న లక్ష్యంతో చేపట్టే ఈ ప్రాజెక్టు కోసం గోదావరి నది నుంచి 20 టీఎంసీ నీటిని తరలించడం ప్రధానం కాగా, అందులో జంట నగరాల తాగునీటి అవసరాల కోసం 17.50 టీఎంసీల నీటిని ఉస్మాన్‌సాగర్, హిమాయత్‌సాగర్ చెరువులను నింపడం, మరో 2.50 టీఎంసీల జలాలను మూసీ నది పునరుజ్జీవనానికి కేటాయించడానికి ఉద్దేశించిన ప్రాజెక్టు ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. “గోదావరి జలాలను తరలించే ఈ గొప్ప కార్యక్రమం ద్వారా జంట నగరాల తాగునీటి సమస్యను పరిష్కరించడమే కాకుండా మూసీ కాలుష్యాన్ని నివారించి నల్గొండ జిల్లా ప్రజలకు విముక్తి కల్పిస్తాం.నగరానికి ప్రతి ఏటా 3 శాతం ప్రజలు వలసలు పెరుగుతున్నాయి. నగరం కోటిన్నర జనాభాకు పెరుగుతున్న తరుణంలో అందుకు తగ్గట్టుగా భవిష్యత్తు ప్రణాళికలు అవసరం. పెరుగుతున్న నగర అవసరాల మేరకు కృష్ణా జలాలు కూడా సరిపోవని అనుకున్నప్పుడు గోదావరి జలాలను తరలించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం.

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత పదేళ్లలో కృష్ణా, గోదావరి నదుల నుంచి చుక్క నీరు కూడా హైదరాబాద్ నగరానికి తరలించలేదు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మళ్లీ గోదావరి నీటిని తరలించి కేవలం హైదరాబాద్ ప్రజలకు తాగునీరే కాకుండా కాలుష్యం నుంచి మూసీ నదిని ప్రక్షాళన చేసే కార్యక్రమం చేపట్టాం.

మురికికూపంగా మారి విషం చిమ్ముతున్న మూసీ జలాల వల్ల ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం, భువనగిరి, ఆలేరు ప్రాంతాల్లో నీరు తాగితే పశువులే కాదు, మనుషులు ప్రాణాలు పోతున్నాయి. పుట్టబోయే బిడ్డలు సైతం అంగవైకల్యంతో మిగితా 4వ పేజీలో

## కోకాపేట ట్రంపెట్ ఇంటర్‌చేంజ్ ప్రారంభం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

హైదరాబాద్ మెట్రోపాలిటన్ అభివృద్ధి సంస్థ కోకాపేట వద్ద నిర్మించిన ట్రంపెట్ ఇంటర్‌చేంజ్‌ను ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు సోమవారం ప్రారంభించారు. కోకాపేట నియోపోలిస్ ఓఆర్ఆర్ (ఎగ్జిట్ 1ఏ) వద్ద ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా హాజరై ఇంటర్‌చేంజ్‌ను ప్రారంభించారు.ప్రారంభోత్సవ వేడుకలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, వివేక్ వెంకటస్వామి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కోకాపేట నియోపోలిస్ లేఅవుట్ నుంచి నేరుగా ఔటర్ రింగ్ రోడ్డుకు కలుపుతున్న ఈ ట్రంపెట్ ఇంటర్‌చేంజ్ ద్వారా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం చేరుకోవడం మరింత సులభతరం కానుంది. దీంతో ప్రయాణికులకు సమయం గణనీయంగా ఆదా అవుతుందని అధికారులు తెలిపారు.



# ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు కట్టుబడి ఉన్నాం

- తుమ్మిడిహట్టి బ్యారేజీకి ప్రణాళికలు
- సమ్మక్క-సారక్క ప్రాజెక్టుకు నీటి కేటాయింపులు
- టీఏసీ క్లియరెన్స్‌కు సిఫారసు
- పాలమూరు-రంగారెడ్డి పూర్తికి ప్రాధాన్యత
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

పాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు పూర్తి చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. తుమ్మిడిహట్టి వద్ద బ్యారేజ్ నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. సోమవారం జలసౌధలో జరిగిన నీటిపారుదల శాఖ సమీక్షా సమావేశంలో మంత్రి పాల్గొని రాష్ట్రంలోని ప్రాజెక్టుల పురోగతిని సమీక్షించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూఎన్నికల మానిఫెస్టోలో ఇచ్చిన మాట ప్రకారం ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును కొనసాగిస్తున్నామని చెప్పారు. సమ్మక్క-సారక్క ప్రాజెక్టుకు ప్రాధాన్యతనిస్తూ ఈ నెల 23న ఢిల్లీలో జరిగే కేంద్ర జలవనరుల సంఘం సమావేశంలో నీటి కేటాయింపులు, టెక్నికల్ అనుమతులు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వంతో చర్చించి అనుమతులు పొందాల్సిన అవసరం ఉందన్నారు. సీతారాం సాగర్, మోడికుంట వాగు, చనాకా/కొరాట డిస్ట్రిబ్యూటరీ సిస్టం, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుల నిర్మాణానికి కావలసిన నిధులను కేంద్రం విడుదల చేసేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని చెప్పారు.

వచ్చే డిసెంబర్ నాటికి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేండ్లు పూర్తి చేసుకున్న దరిమిలా రాష్ట్రంలోని ప్రాజెక్టుల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆయన సూచించారు. కృష్ణా జలాల వివిధ ట్రిబ్యునల్ విషయమై సుప్రీంకోర్టులో ఈ నెల 23-25న వాదనలు ఉన్నాయనీ, అంతకు ముందే సుప్రీంకోర్టు న్యాయవాది సి.ఎస్.వైద్యనాథ్‌తో చర్చలు జరగనున్నాయన్నారు.

జాతీయ డ్యామ్‌ల పరిరక్షణ సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ) చేసిన సూచనలకు అనుగుణంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ళ బ్యారేజీలను పునరుద్ధరణ ఉంటుందన్నారు. బ్యారేజీలను పునరుద్ధరించడంలో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతతో ఉందన్నారు. కాగా ఎన్‌డీఎస్ఏ సూచనలకు అనుగుణంగా పనులు ముందుకు సాగుతాయని ఆయన స్పష్టం చేశారు. అయితే అదే సమయంలో ఐఐటీ వంటి సంస్థలతో నిర్మాణానికి సంబంధించిన అంశాలను పరీక్షించేలా చర్యలు తీసుకోవడంతో పాటు వరదలు తగ్గిన వెంటనే పనులు చేపట్టేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. వచ్చే ఏడాది వానాకాలం లోపు పనులు పూర్తి చేయాలన్నారు. అన్నింటికీ మించి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పూర్తికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, పునరావాసంతో పాటు అటవిశాఖా అనుమతుల వంటి ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలన్నారు. కొడంగల్-నారాయణపేట ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. మిగితా 4వ పేజీలో

# రాష్ట్రంలో 'ఏఐ' సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్




- ఆస్ట్రేలియా 'డికన్ యూనివర్సిటీ' భాగస్వామ్యంతో ఏర్పాటు
- మంత్రి శ్రీధర్ బాబు సమక్షంలో 'లెటర్ ఆఫ్ ఇంటెంట్' పై సంతకాలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో 'ఏఐ' సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ను ఏర్పాటు చేసేందుకు ఆస్ట్రేలియాకు చెందిన ప్రముఖ విద్యాసంస్థ 'డికన్ విశ్వవిద్యాలయం' ముందుకొచ్చింది. ఇందుకు సంబంధించిన లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్ వోఐ)పై సోమవారం డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో 'డికన్ యూనివర్సిటీ' వీసీ ప్రొఫెసర్ ఇయాన్ మార్టిన్, ఐటీ శాఖ డిప్యూటీ సెక్రటరీ భవేష్ మిశ్రా సంతకాలు చేశారు. అనంతరం ఈ ఒప్పంద పత్రాలను పరస్పరం మార్పిడి చేసుకున్నారు. 'అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా ఏఐ రంగంలో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా తీర్చిదిద్దాలన్నదే మా ప్రభుత్వ సంకల్పం. ఏఐలో నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించాలనే లక్ష్యంతోనే ఈ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ఏర్పాటుకు డికన్ యూనివర్సిటీతో ఒప్పందం చేసుకున్నాం. ఇది కేవలం లాంఛనప్రాయ ఒప్పందం కాదు. రాబోయే రోజుల్లో కీలక రంగాల్లో తెలంగాణ, ఆస్ట్రేలియా మధ్య ద్వైపాక్షి సంబంధాల మెరుగుదలకు దిక్సూచీగా మారుతుంది. సమాజానికి ఉపయోగపడే అత్యాధునిక ఏఐ పరిష్కారాలను అభివృద్ధి చేయడంతో పాటు పరిశోధనలు, వ్యవస్థాపకతకు కొత్త అవకాశాలను సృష్టిస్తుంది' అని ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు వివరించారు.

**ఏఐ కోర్సుల రూపకల్పన, శిక్షణ, స్టార్టప్ లకు చేయూత**

'ఏఐ, డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ రంగాల్లో ప్రపంచానికి అత్యంత నైపుణ్యమున్న మానవ వనరులను తెలంగాణ నుంచే అందించాలని లక్ష్యంగా పెట్టుకుని, ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం. ఈ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్, యంగ్ ఇండియన్ స్కిల్ యూనివర్సిటీ సంయుక్తంగా నేటి మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఏఐ కోర్సులకు రూపకల్పన చేసి, ఇక్కడి యువతకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన శిక్షణనిస్తాయి. మన ఏఐ స్టార్టప్ సంస్థలు అంతర్జాతీయ మార్కెట్ లో తెలంగాణ బ్రాండ్ ను మరింత విశ్వ వ్యాప్తం చేసేలా ఆస్ట్రేలియా నిపుణులు మార్గదర్శకత్వం చేస్తారు ' అని మంత్రి శ్రీధర్ బాబు చెప్పారు.

**ఏఐ ఆధారిత పౌర సేవలను అందించేలా...**

'ఏఐ కేవలం ఒక సాంకేతికత మాత్రమే కాకుండా, సమ్మిళిత వృద్ధికి, మానవాభివృద్ధికి ఒక శక్తివంతమైన సాధనంగా మార్చేలా మా ప్రభుత్వం పకడ్బందీ ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తోంది. ఈ లక్ష్య సాధనలో ఈ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ మార్గదర్శిగా మారుతుంది. ఆరోగ్య సంరక్షణ,

వ్యవసాయం, గవర్నెన్స్ తదితర రంగాల్లో ఏఐ వినియోగాన్ని పెంచి పౌర సేవలను మరింత సమర్థవంతంగా అందించేలా సంయుక్త పరిశోధనలు నిర్వహిస్తాం. ప్రస్తుతం సమాజం ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు ఏఐ ఆధారిత పరిష్కారాలను కనుగొనేందుకు కృషి చేస్తాం' అని తెలిపారు.

'ఏఐలో తెలంగాణను గ్లోబల్ లీడర్ గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషి ప్రశంసనీయం. ప్రజల శ్రేయస్సు కోసం సమర్థవంతమైన, బాధ్యతాయుతమైన ఏఐ పరిష్కారాలను అందించాలనే లక్ష్యంతోనే భారత్ లో సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ను ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నాం. ఇందుకోసం తెలంగాణ అన్ని రకాలుగా అనుకూలంగా ఉందని గుర్తించాం. అందుకే ఇక్కడ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చాం' డికన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఇయాన్ మార్టిన్ తెలిపారు.

## మేడారం అభివృద్ధి పనులు వంద రోజుల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి

- సీఎం రేవంత్ రెడ్డి
- మేడారం, బాసర ఆలయాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమావేశం

వివరాలు 4వ పేజీలో

## ఆధార్‌ను ఐడీ ప్రూఫ్‌గా ఆమోదించాల్సిందే

- ఎన్నికల కమిషన్‌కు సుప్రీం ఆదేశాలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

బీహార్ సమగ్ర ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్)లో ఆధార్‌ను కూడా కచ్చితంగా గుర్తింపు కార్డుగా పరిగణించాలని భారత సర్వోన్నత న్యాయస్థానం ఎన్నికల కమిషన్(ఈసీ)ను ఆదేశించింది. ఈ మేరకు మార్గదర్శకాలు జారీ చేసింది. అలాగే ఆధార్ అనేది పౌరసత్వానికి మాత్రం ధ్రువీకరణ కాదని కూడా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అక్రమ వలసదారుల సమస్య దృష్ట్యా.. అవసరమైన వేళ ఎన్నికల కమిషన్ సదరు ఆధార్ సరైనదేనా అనేది తనిఖీ చేయవచ్చని వెల్లడించింది. రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ), ఏఐఎంఐఎం ఇతర పార్టీలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్య బాగ్చీల ధర్మాసనం విచారణ జరిపింది. సదరు పార్టీలు తమ వాదనలు వినిపించాయి. దీనికి సంబంధించి న్యాయస్థానం ఆధార్‌ను ఐడీ ప్రూఫ్‌గా గుర్తించాలంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఓటరు జాబితాలో చేర్చడానికి లేదా తొలగించడానికి ఆధార్‌ను కూడా ఎన్నికల కమిషన్ ప్రకటించిన ధ్రువీకరణ పత్రాల జాబితాలో 12వ పత్రంగా పరిగణించాలని ధర్మాసనం చెప్పింది. ఇది 1950 నాటి ప్రజా ప్రాతినిధ్య చట్టానికి అనుగుణంగా తీసుకొన్న నిర్ణయమని వివరించింది. ఇప్పటికే ఈ జాబితాలో పాస్‌పోర్టు, బర్త్ సర్టిఫికెట్ వంటి 11 పత్రాలను ఐడీ ప్రూఫ్‌లుగా ఈసీ స్వీకరిస్తోన్న విషయం విదితమే. తమ ఆదేశాలు ప్రజలకు తెలిసేలా ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో ప్రదర్శించాలని ఈసీ తరఫున హాజరైన సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేదికి ధర్మాసనం సూచించింది. అంతకు ముందు రాకేశ్ ద్వివేది తన వాదనలు వినిపిస్తూ ఈసీఐ.. ఆధార్‌ను ప్రూఫ్‌గా స్వీకరించడానికి అంగీకరించినా.. పిటిషనర్లు దానిని 12వ గుర్తింపు పత్రంగా చేర్చాలని కోరడం దేనికని ప్రశ్నించారు. పౌరసత్వ ధ్రువీకరణ విషయంలో పాస్‌పోర్టుకు ఉన్న విలువ ఆధార్‌కు లేదని చెప్పారు. అలాంటప్పుడు దానిని ఆ జాబితాలో ఎలా చేరుస్తామని చెప్పారు.

కాగా బీహార్‌లో చేపట్టిన వివాదాస్పద ఎస్ఐఆర్ రాజకీయంగా తీవ్ర దుమారాన్ని రేపిన విషయం విదితమే. ఈసీ సమాచారం ప్రకారం.. అభిప్రాయాలు, సూచనల కోసం ఇచ్చిన గడువు సెప్టెంబర్ 1 నాటికి ముగిసింది. ఈనెల 30 నాటికి తుది ఓటరు జాబితా విడుదల కానున్నది. ఆగస్టు 22 నుంచి 30 మధ్య ఓటరు జాబితాలో చేరికలకు సంబంధించి 22,723 క్లెయిమ్‌లను, తొలగింపుల విషయంలో 1.34 లక్షలకు పైగా అభ్యంతరాలను స్వీకరించింది.

# అంగన్వాడీలకు ఫుడ్ గ్యాప్ ఉండొద్దు

- సకాలంలో సరుకులు అందేలా చర్యలు తీసుకోవాలి
- గుడ్ల సరఫరాలో లోపాలు జరిగితే కఠిన చర్యలు
- మహిళల భద్రతపై త్వరలో సదస్సు
- మహిళా శిశు సంక్షేమ శాఖ సమీక్షా సమావేశంలో మంత్రి సీతక్క



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ పనితీరుపై మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క సోమవారం నాడు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో శాఖ కార్యదర్శి అనిత రామచంద్రన్, డైరెక్టర్ సృజన, సిబ్బంది పాల్గొన్నారు. శాఖలో జరుగుతున్న పనుల పురోగతిపై, అమలవుతున్న పథకాలపై అధికారులు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు.సమీక్ష సందర్భంగా మంత్రి సీతక్క అంగన్వాడీ కేంద్రాలకు సరుకులు సకాలంలో అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. గుడ్లు, పాలు, పప్పు, మంచినూనె, స్నాక్స్, బాలమృతం సరఫరాపై సమీక్ష జరిపారు. అధికారుల నివేదిక ప్రకారం పాలు మినహా మిగిలిన వస్తువులన్నీ 98 శాతం పైగా సరఫరా అవుతుండగా, పాలు మాత్రం గత నెలలో 58 శాతం మాత్రమే సరఫరా అయ్యాయని తెలిపారు. పాల సరఫరా లోపంపై మంత్రి సీరియస్‌గా స్పందించి, పాలతో సహా ఎక్కడా ఫుడ్ గ్యాప్ లేకుండా చూడాలని ఆదేశాలు జారీ చేశారు.గుడ్ల సరఫరా విషయంలో మంత్రి సీతక్క అధికారులకు కీలక ఆదేశాలు ఇచ్చారు. 5 జిల్లాలు మినహా మిగిలిన 28 జిల్లాల్లో జిల్లా కలెక్టర్లు టెండర్లు ఖరారు చేసినట్లు అధికారులు తెలియజేశారు. గుడ్ల సరఫరాలో కలర్ కోడింగ్ తప్పనిసరి అని మంత్రి స్పష్టం చేస్తూ, ప్రతి పది రోజులకు ఒకసారి ఏజెన్సీలు గుడ్లు సరఫరా చేయాలని ఆదేశించారు. లేనిపక్షంలో కాంట్రాక్టులను రద్దు చేస్తామని హెచ్చరించారు.

అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారుల కోసం త్వరలో బ్రేక్‌ఫాస్ట్ స్కీం ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. 1261 అంగన్వాడీ భవనాల నిర్మాణానికి లక్ష్యాన్ని నిర్ణయించగా, 1181 కేంద్రాలకు స్థలాలు గుర్తించామని అధికారులు తెలిపారు. త్వరలో పనులు ప్రారంభించి నవంబర్ 19న మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి లోపు భవనాల నిర్మాణం పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు. స్థానిక కాంట్రాక్టర్లు ముందుకు రాకపోతే నిర్మాణ బాధ్యతలను ఏజెన్సీలకు అప్పగించాలని సూచించారు. అలాగే అంగన్వాడీ కేంద్రాల్లో బల్లలు, సిబ్బంది యూనిఫాంలు, చిన్నారుల యూనిఫాంలు తక్షణం సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

మహిళల భద్రత అంశంపై కూడా మంత్రి దృష్టి సారించారు. త్వరలో ప్రభుత్వ ఉద్యోగినులు, ప్రజా సంఘాలు, ఉద్యోగ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో మహిళా రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి, మహిళల భద్రత కోసం చేపట్టాల్సిన చర్యలపై చర్చించనున్నట్లు మంత్రి సీతక్క ప్రకటించారు.ఈ నెల 19,20 తేదిల్లో మహిళా భద్రత పై చర్చించేందుకు రౌండ్ టెబుల్, మహిళా సదస్సు నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని ఆదేశాలు జారి చేశారు మంత్రి సీతక్క.

# సమ్మక్క-సారక్క జాతరకు రూ. 150 కోట్లు

- హర్షం వ్యక్తం చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

సమ్మక్క-సారక్క జాతరను కనివిని ఎరుగని రీతిలో నిర్వహించి రాష్ట్రానికి ఆదర్శంగా నిలపాలని సంకల్పంతో, భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా అన్ని సౌకర్యాలను సమకూర్చేందుకు ముఖ్యమంత్రి శ్రీ ఏ. రేవంత్ రెడ్డి గారు రూ.150 కోట్లు మంజూరు చేసినట్లు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తెలిపారు. నిధుల కేటాయింపు సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ గారు హర్షం వ్యక్తం చేస్తూ, “సమ్మక్క-సారక్క జాతర గిరిజనుల భక్తిశ్రద్ధలకు ప్రతీక. ఈ జాతరను విశ్వస్థాయిలో గుర్తింపు పొందేలా నిర్వహించడమే ప్రభుత్వ సంకల్పం” అని స్పష్టం చేశారు.

జూబ్లీహిల్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో సోమవారం సమ్మక్క సారక్క జాతర ఏర్పాట్లు కు సంబంధించిన సమీక్షా సమావేశంలో జాతర నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలు, విజయవంతంగా నిర్వహించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చ జరిగింది. ఈ సమావేశంలో ఇన్చార్జి మంత్రి రెవెన్యూ శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శ్రీమతి సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్ సంక్షేమ శాఖ ల శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ గార్లు పాల్గొన్నారు.

**భక్తుల కోసం సమగ్ర సదుపాయాలు**

జాతర సందర్భంగా లక్షలాది మంది భక్తులు తరలివచ్చే దృష్ట్యా శుద్ధమైన తాగునీరు, విద్యుత్, రవాణా, వైద్యశిబిరాలు, శానిటేషన్ వంటి అన్ని ప్రాథమిక సదుపాయాలు కల్పించాలని సీఎం గారు అధికారులకు ఆదేశించారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం ప్రత్యేక రవాణా ప్రణాళిక, పార్కింగ్ సౌకర్యాలు ఏర్పాటుచేయనున్నారు.

**భద్రతా చర్యలు**

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పోలీసుల ప్రత్యేక బందోబస్తు, సీసీ కెమెరాలు, మిగితా 4వ పేజీలో

## 21 నుంచి పాఠశాలలకు దసరా సెలవులు

- అక్టోబర్ 4న పునఃప్రారంభం
- జూనియర్ కాలేజీలకు 28 నుంచి..

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో దసరా సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. ఈనెల 21 నుంచి అక్టోబర్ 3 వరకు అన్నీ పాఠశాలలకు సెలవులు ఉంటాయని వెల్లడించింది. సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 5 వరకు జూనియర్ కాలేజీలకు సెలవులు ప్రకటించారు. దసరా పండగ నేపథ్యంలో విద్యాసంస్థలకు ఈసారి మొత్తం 13 రోజుల పాటు సెలవులను ఉండనున్నాయి. వరుసగా ఏకంగా 13 రోజులు సెలవులు రావడంతో విద్యార్థులు ఆనందంలో మునిగిపోయారు. నగరాల్లోని వివిధ హాస్టళ్లలో ఉండే విద్యార్థులు తమ ఊర్లకు వెళ్లేందుకు ఇప్పటినుంచే ప్రణాళికలు వేసుకుంటున్నారు. సెప్టెంబరు 21వ తేదీ(ఆదివారం) నుంచి 3వ తేదీ(శుక్రవారం) వరకు సెలవులుగా ప్రకటించింది. అక్టోబర్ 4న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ సారి అక్టోబర్ 2వ తేదీ గాంధీజయంతి రోజునే దసరా పండుగ వచ్చింది.

# కాంగ్రెస్ నేతలు క్షమాపణ చెప్పాలి




- మల్లన్నసాగర్-మూసీ అనుసంధాన ప్రాజెక్టు ఓ క్రిమినల్ చర్య
- కొండపోచమ్మ సాగర్ నుంచి నీళ్లు ఎందుకు తేవడం లేదు
- రూ.1,100 కోట్లతో ఉన్న అంచనాలు ఏడు రెట్లు ఎందుకు పెరిగాయి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కాళేశ్వరం ప్రాజెక్టుపై చిల్లర ఆరోపణలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహా కాంగ్రెస్ నేతలు ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు (కేటీఆర్) డిమాండ్ చేశారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ ఆయన కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.కాళేశ్వరం ప్రపంచంలోని అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అని గుర్తుచేసిన కేటీఆర్, ఇప్పటివరకు 240 టీఎంసీల నీరు వినియోగమై, 20 లక్షల ఎకరాలకు సాగునీరు అందిందన్నారు. “12 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా మేడిగడ్డ మిగితా 4వ పేజీలో

# కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే రైతన్నలకు కష్టాలు

- **రైతుల మీద కేసులు పెడితే ఊరుకోం..**
- **బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు**



**బలగం టీవీ, వేములవాడ**

గత 10 సంవత్సరాల నుండి యూరియా కొరత లేకుండా రైతన్నలకు అందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు యూరియా కష్టాలు మొదలయ్యాయని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. రైతులపై కేసులు పెడితే చూస్తూ ఊరుకునేది లేదని, తమకు కేసులు కొత్త కాదని, రైతన్నల పక్షాన పోరాడుతామని హెచ్చరించారు. వేములవాడలోని రాజన్న ఆలయాన్ని దసరా పండుగకు మూసివేయడం చిరు వ్యాపారుల పొట్ట కొట్టడమేనని, ఆలయాన్ని ఎన్ని దశల్లో అభివృద్ధి చేస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు గురించి ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌కు సరైన అవగాహన లేదని, ఆయన కాళేశ్వరం ప్రాజెక్టు గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందని లక్ష్మీనరసింహారావు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మండిపడ్డారు.

ఈ సందర్భంగా చల్మెడ లక్ష్మీనరసింహారావు మాట్లాడుతూ.. "కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల మీద ఎటువంటి శ్రద్ధ లేదనీ, ఒకవైపు ముఖ్యమంత్రి మాట్లాడుకుంటూ అసలు యూరియా కొరత లేదంటారు.. మరోవైపు వ్యవసాయ శాఖ మంత్రి మాట్లాడుకుంటూ 9 లక్షల మెట్రిక్ టన్నులు ఈ రాష్ట్రానికి రావాల్సి ఉండగా కేవలం 5 లక్షల మెట్రిక్ టన్నులే వచ్చినాయని చెప్తా ఉంటారు. అసలు ముఖ్యమంత్రికి, మంత్రులకే అసలు ఏం మాట్లాడుతున్నారో అవగాహన లేకపోవడం చాలా విడ్డూరకరమన్నారు. యూరియా కొరత ఉండి రైతులు ఆవేశంతో.. వారి మనోవేదనను మీడియాతో వ్యక్త పరిస్తే.. మరుసటిరోజే ప్రభుత్వ విప్ మనుషులు వెళ్లి వారిని బెదిరించి తీసుకొచ్చి మీడియా ముందు రైతులతో మాట్లాడించడం జరిగింది అయ్యో మేము అన్నాము ఆవేశంగా అన్నాము. పొరపాటు లేదు, యూరియా ఉంది. మా సీనన్నకు ఫోన్ చేస్తే ఉంది అన్నాడు అబద్ధం అని చెప్పింద్రు. మరి సీనన్నకు ఫోన్ చేసి వచ్చినాక దాదాపు 45 రోజులు అయినా కూడా ఇయ్యాల కూడా గదే పరిస్థితి రుద్రంగిలో ఎందుకుందని మీ ద్వారా నేను ఎమ్మెల్యేను ప్రశ్నిస్తున్న%ొ% ఇయ్యాల కాంగ్రెస్ నాయకుడు ఆరోజు మాట్లాడిననే మళ్లీ ఒక వీడియో చూపిస్తా మీకు కావాలంటే దీని తర్వాత. నేను పొద్దుగాలనే 5:00 గంటలకు పోయి సాయంత్రం దాకా ఉన్న బస్తా దొరకడం లేదని నా పరిస్థితి ఏందని అదే కాంగ్రెస్ నాయకుడు మా శీనన్నకు ఎట్ల బతుకుడు అని ప్రశ్నిస్తున్నాడు మా సీనన్నకు ఫోన్ చేస్తే అంటనే, మరి ఈయన ఫోన్ మర్చిపోయిండా? ఫోన్ నెంబర్ మర్చిపోయిండా? అని మీ ద్వారా ప్రశ్నిస్తా ఉన్నాను" అని అన్నారు.

"సిరిసిల్ల జిల్లాలో వేములవాడ పట్టణంలో ఎరువుల కోసం రైతులు ఉదయం 6 గంటలకు వచ్చి వాళ్ళు పెద్ద లైన్ కట్టి సాయంత్రం 6 గంటల వరకు ఉన్న ఒక బస్తా కూడా దొరకకపోవడంతో చివరికి రోడ్డుపై ధర్నా చేసే పరిస్థితి వచ్చిందని, ఉదయం నుండి నిలుచుని ఉన్నారని మా బి ఆర్ ఎస్ నాయకులు రైతుల వద్దకు వెళ్లి మంచినీళ్లు ఇస్తే కూడా%ొ% అక్రమంగా 8 మంది నాయకుల మీద పోలీస్ కేసులు పెట్టించాడని అన్నారు. రెండు రోజుల కింద ఎల్లారెడ్డిపేటలో లక్ష్మణ్ అనే రైతు, "నా చెప్పుతో నేనే కొట్టుకుంటున్నాను ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి ఓటు వేసి తీసుకొచ్చిన" అని చెప్తే, తెల్లారే పోలీసులు పోయి మళ్లీ ఆ రైతుపై కూడా కేసు ఎట్టి ఇంటికి మరీ పోలీసులను పంపారు. ఎరువులు అడిగిన పాపానికి కూడా రైతులపై కేసులు పెడతారా ఇదేనా ప్రజా పాలన" అని ప్రశ్నించారు.

"కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా యూరియా ఎక్కువ కొరత ఉందంటే ఆది రాజన్న సిరిసిల్ల జిల్లాలో. సుమారుగా.21000 మెట్రిక్ టన్నుల యూరియా ఈ పంటకు అవసరం ఉంటే ఇప్పటివరకు సరఫరా చేసింది కేవలం 15000 మెట్రిక్ టన్నులే. ఇంకా 6000 మెట్రిక్ టన్నులు అవసరం ఉంది ఈ జిల్లా రైతులకు%ొ%మరి నేను గౌరవ శాసనసభ్యులు డిమాండ్ చేస్తా ఉన్నా. ఈ 6000 మెట్రిక్ టన్నులు ఎంత లోపట రైతుకు తీసుకొచ్చి మీరు సరఫరా చేస్తారో మీరు బాధ్యత వహించాలి" అని డిమాండ్ చేస్తున్నానని అన్నారు.

"ఈరోజు ప్రభుత్వమే వాళ్ళ మీద కేసులు పెడుతుంద్రు.. ఇకపై బాధ వ్యక్తం చేసే ఏ రైతు పైన కేసులు పెట్టకుండా చూడవలసిన బాధ్యత మీ మీద ఉంది, ఆది శ్రీనివాస్ గారు" అని అన్నారు.

## కాంగ్రెస్‌పైన అనుచిత వాఖ్యలు చేసినందుకు ఇద్దరు వ్యక్తుల మీద పిటిషన్..

**కాంగ్రెస్ బోయినిపల్లి మండల నాయకులు..**

**బలగం టీవీ, బోయినిపల్లి**



భారత దేశ మాజీ ప్రధాని స్వర్గీయ రాజీవ్ గాంధీ, సోనియా గాంధీ, మరియు లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పైన సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు మరియు ఫోటోలు పోస్ట్ చేసిన ఇద్దరు వ్యక్తులపై బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ చర్యపై కాంగ్రెస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు కొడగాని వెంకటేష్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు ఏనుగుల అనిల్ కుమార్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఏనుగుల ప్రశాంత్ కుమార్, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు పెండ్యాల శ్రీనివాస్ రెడ్డి, అమ్మిగల్ల గోపాల్, మొగుళోజి శ్రీకాంత్, నక్క శ్రీకాంత్, గుంటి జలందర్, ఏమిరెడ్డి దిలీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జేఎన్‌టీయూ విద్యార్థుల పై పోలీసుల దౌర్జన్యాన్ని ఖండిస్తున్నాం..



- **విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే తీర్చాలి..**
- **బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

జేఎన్టీయూ విద్యార్థులపై పోలీసుల దౌర్జన్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, వారి న్యాయమైన డిమాండ్లను తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు అన్నారు. సోమవారం జేఎన్టీయూ విద్యార్థులు తమ డిమాండ్ల సాధనకై ధర్నా, రాస్తారోకో చేయడంతో వారిని పోలీసులు అడ్డుకొని దౌర్జన్యంగా పోలీస్ స్టేషన్ కు తరలించారు. విషయం తెలుసుకున్న చల్మెడ లక్ష్మీనరసింహారావు పోలీస్ స్టేషన్లో ఉన్న విద్యార్థుల వద్దకు చేరుకొని వారికి మద్దతు తెలిపారు.

ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ.. గడిచిన బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రివర్యులు కేటీఆర్ గారు సిరిసిల్లలో జేఎన్టీయూ యూనివర్సిటీ ఉండాలని మండపల్లిలో 20 ఎకరాల స్థలాన్ని చూసి సుమారుగా 450 కోట్ల రూపాయలతో జేఎన్టీయూ యూనివర్సిటీకి జీవో విడుదల చేశారు. కానీ ప్రభుత్వం మారిన తరణంలో ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కనీసం వారికి తరగతి గదులు, హాస్టల్, ఉపాధ్యాయులను ఏర్పాటు చేయడంలో విఫలమైందని, వారి న్యాయపరమైన డిమాండ్లను వెంటనే తీర్చాలని పైఅధికారులను, వైస్ ప్రిన్సిపాల్ ను, కలెక్టర్ ను విద్యార్థులు కోరినప్పటికీ వారు పట్టించుకోకపోవడంతో ఈరోజు వారు అగ్రహారం వద్ద రాస్తారోకోకు దిగడంతో పోలీసులు అడ్డుకొని వారిని పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చి నిర్బంధించడం ఎంతవరకు సమంజసమని మీడియా ద్వారా ప్రశ్నిస్తున్నామన్నారు. వెంటనే ముఖ్యమంత్రి నిధులను విడుదల చేసి భవనాన్ని నిర్మించేందుకు శంకుస్థాపన చేయాలనీ విద్యార్థుల పక్షాన డిమాండ్ చేస్తున్నమన్నారు. అలాగే పోలీసులు విద్యార్థుల వెంటనే విడుదల చేయాలన్నారు. వారి వెంట సీనియర్ నాయకులు ఏనుగు మనోహర్ రెడ్డి, బొల్లి రామ్మోహన్, మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, పట్టణ ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, మాజీ కౌన్సిలర్లు మారం కుమార్, నిమ్మశెట్టి విజయ్, నరాల శేఖర్, జోగిని శంకర్, గోలి మహేష్, నాయకులు నీలం శేఖర్, సందీప్ కుమార్ తదితరులు ఉన్నారు.

## అల్లు అరవింద్ మాతృమూర్తి దశదిన కర్మకు హాజరైన కేటీఆర్

**బలగం టీవీ, హైదరాబాద్**



ప్రముఖ సినీ నిర్మాత అల్లు అరవింద్ మాతృమూర్తి, దివంగత నటుడు పద్మశ్రీ అల్లు రామలింగయ్య సతీమణి అయిన అల్లు కనకరత్నమ్మ దశదిన కర్మకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్ హాజరయ్యారు. అల్లు కుటుంబ సభ్యులతో కలిసి కనకరత్నమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అల్లు అరవింద్, అల్లు అర్జున్, అల్లు శిరీష్ తో పాటు ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ కష్ట సమయంలో అల్లు కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

## ఏఎస్పీ శేషాద్రి రెడ్డిని కలిసిన రాజన్న ఆలయ ఈఓ

**బలగం టీవీ, వేములవాడ**



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి (ఈవో) రమాదేవి, వేములవాడ అదనపు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఏఎస్పీ) శేషాద్రి రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా, ఈవో రమాదేవి ఏఎస్పీకి స్వామివారి శేష వస్త్రం, లడ్డు ప్రసాదాన్ని అందజేశారు. ఈ భేటీలో ఆలయ అభివృద్ధి పనుల గురించి, ముఖ్యంగా ఆలయ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్లడానికి దేవస్థానం మరియు పోలీస్ విభాగాల మధ్య సమన్వయం ఎలా ఉండాలనే విషయంపై ఇద్దరూ చర్చించారు. భక్తులకు మరింత మెరుగైన సేవలను అందించేందుకు, శాంతిభద్రతల విషయంలో ఇరు విభాగాలు కలిసి పని చేయాలని నిర్ణయించారు.

# కేసీఆర్ గరళకంఠుడు..

**- ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్**

**బలగం టీవీ, శ్రీశైలం**



ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ తన పుట్టినరోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో ప్రత్యేక దర్శనం చేసి, పూజలు నిర్వహించారు. అనంతరం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ మీడియాతో మాట్లాడుతూ.. మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు, సతీమణి శోభమ్మ లకి ఆయురారోగ్యాలు కలగాలని, స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని నేను భగవంతుని ప్రార్థించాను. ఎంతటి సవాళ్లు వచ్చినా కేసిఆర్ వాటిని ఎదుర్కొనే శక్తి కలిగిన మహానాయకుడు. తెలంగాణ ప్రజలకు కేసిఆర్ అవసరం అని ఆయన పేర్కొన్నారు.

డా. శ్రవణ్ కే.సి.ఆర్ ను "గరళకంఠుడు"గా పోల్చుతూ, "సముద్ర మథనంలో గరళాన్ని తన గొంతులో నిలుపుకుని, మొత్తం విశ్వాన్ని కాపాడిన పరమశివుడిలా, కే.సి.ఆర్ కూడా ప్రస్తుతం తనపై, తన కుటుంబంపై, బీఆర్ఎస్ పార్టీపై జరుగుతున్న కుట్రలు, దాడులు, వెన్నుపోట్లను తనలోనే దాచుకుంటూ, తనకు తానే భరిస్తూ, తెలంగాణ ఆకాంక్షల కోసం పోరాడుతున్నారు. ఆయన మూడోసారి ముఖ్యమంత్రిగా అవ్వాలని నేను మల్లికార్జున స్వామిని మనఃపూర్వకంగా ప్రార్థించాను" అని అన్నారు. "సంక్షోభాలు ఏవైనా వచ్చినా కే.సి.ఆర్ మళ్లీ ముఖ్యమంత్రిగా అవుతారని నాకు నమ్మకం ఉంది" అని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలు, ముందు చూపు లేకపోవడం వల్ల రాష్ట్రంలో యూరియా కొరత వంటి సమస్యలు తీవ్రతరం అవుతున్నాయని ఆయన విమర్శించారు. "రైతుల సమస్యలు పరిష్కరించబడాలని, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని భగవంతుని ప్రార్థించాను" అని తెలిపారు. అలాగే, "రాష్ట్రాలుగా విడిపోయినా మనం ప్రజలుగా కలిసే ఉండాలి. ఆంధ్రప్రదేశ్ దేవాలయాల ట్రస్ట్ బోర్డుల్లో తెలంగాణ వాసులకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలి" అని సూచించారు. వచ్చే ఎన్నికల్లో కేసిఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అయిన వెంటనే ఆయనను ప్రత్యేకంగా శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున అమ్మవారి దర్శనానికి రమ్మని కోరుతాను అని డా. దాసోజు శ్రవణ్ తెలిపారు.



## పీహెచ్‌డీ సాధించిన ఎనగందుల శ్రీనుకు ఘన సత్కారం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

పీహెచ్‌డీ (డాక్టరేట్) పట్టా పొందిన ఎనగందుల శ్రీను ను శాలువాతో ఘనంగా సన్మానించిన ఫ్యాక్స్ చైర్మన్, జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, పలువురు రెడ్డి సంఘం నాయకులు, ముత్యాల ప్రభాకర్ రెడ్డి, యమగొండ బాల్ రెడ్డి శాలువా కప్పి సత్కరించి ఆయనను అభినందించారు. విద్యా రంగంలో విశేష కృషి చేసి, ఉన్నతమైన పీహెచ్‌డీ పట్టా పొందిన శ్రీనును వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు రెడ్డి సంఘం నాయకులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# జేఎన్‌టీయూ విద్యార్థుల రాస్తారోకో..




**-మద్దతు తెలిపిన బిఆర్ఎస్వి, ఎబివిపి సంఘం నాయకులు**

**-పోలీస్ స్టేషన్ కి తరలింపు**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

అగ్రహారం డిగ్రీ కాలేజీలో తాత్కాలికంగా కొనసాగుతున్న జేఎన్టీయూ కళాశాల తరగతీ గదులకు,ల్యాబ్స్, మరుగుదొడ్లకి తాళం వేశారం టూ సిరిసిల్ల – కరీంనగర్ రహదారి జేఎన్టీయూ విద్యార్థులు రాస్తారోకో నిర్వహించారు. వీరి ధర్నాకు బీఆర్ఎస్వి, ఏబీవీపీ నాయకులు మద్దతు తెలిపారు. సుమారు గంట పాటు రాస్తారోకో నిర్వహించడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. సంఘటన స్థలానికి చేరుకొని వ బిఆర్ఎస్వి, ఎబివిపి సంఘం నాయకులను పోలీస్ స్టేషన్ కి తరలించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూజేఎన్టీయూ విద్యార్థులకు ప్రవేశం లేదని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నోటీసులు అతికించి గేటుకు తాళం వేశారు అని,ఈ వ్యవహారంపై కలెక్టరేట్ వరకు కాలినడకన వెళ్లి ఫిర్యాదు చేశాము అని,అయినా కూడా తరగతి గదులు తెరుచుకోలేదని అన్నారు. ప్రభుత్వం విద్యార్థుల చదువులతో చెలగాటం ఆడుతున్నారని అన్నారు. సరైన సౌకర్యాలు లేవని, ల్యాబ్ ల కోసం కొండగట్టు జెఎన్టియు క్యాంపస్ కు వెళ్తున్నామని, తాత్కాలికంగా హాస్టల్స్ సౌకర్యం కల్పించారని, పర్మినెంట్ ఫ్యాకల్టీ లేదు అని, సిరిసిల్ల జేఎన్టీయూ సుమారు 1200 మంది విద్యార్థులను చదువుకుంటున్నామని, నాలుగు సంవత్సరాలు అవుతున్న ఇప్పటివరకు పర్మినెంట్ బిల్డింగ్స్ లేవని అన్నారు. ప్రభుత్వం వెంటనే పూర్తిస్థాయిలో క్యాంపస్ నిర్మించాలని డిమాండ్ చేశారు.




## ఆర్ఓ ప్లాంట్ వినియోగంలో ఉందా...?

**-తంగళ్ళపల్లి కేజీబీవీలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ**

**బలగం టీవీ,తంగళ్ళపల్లి**

తంగళ్ళపల్లి మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం(కేజీబీవీ)లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కిచెన్, వంట గది, స్టోర్ రూమ్, బోజనానికి వినియోగించే ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు. ఆర్ఓ ప్లాంట్ వినియోగంలో ఉందా? లేదా అని ఆరా తీశారు. అన్ని తరగతి గదుల్లో బోధన కొనసాగుతుండగా, పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. సీఈసీ విద్యార్థులకు ఎకనామిక్స్ పాఠాలు బోధించి, పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యాలయం ఆవరణలో గడ్డి, ఇతర వ్యర్థాలు వెంటనే తొలగించాలని పంచాయతీ కార్యదర్శిని కలెక్టర్ ఆదేశించారు.

# అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి

**-గురువారం కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను విజయవంతం చేయండి.**

**-సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ము శం రమేష్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**




గత ప్రభుత్వం అర్హులుగా గుర్తించి డబుల్ బెడ్ రూమ్ ఇవ్వకుండా అన్యాయం చేసిన వాళ్లందరికీ,మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ పథకం కింద ఇంటి స్థలం తో పాటు,ఇల్లు నిర్మించుకోవడానికి ఐదు లక్షలు ఇవ్వాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ము శం రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.సోమవారం సిరిసిల్ల పట్టణంలో ని అమృత్యులాల్ శుక్ల కార్మిక భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ము శం రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇల్లు లేని నిరుపేదలం దరికీ, ఇంటి స్థలంతో పాటు ఐదు లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి,ఇప్పటికి రెండు సంవత్స రాలు కావస్తున్న, పేదల ఇండ్ల కల,కలగానే మిగిలిపోయిందని అన్నారు. గత టిఆర్ఎస్ ప్రభుత్వం అందరికీ, డబుల్ బెడ్ రూములు ఇస్తామని చెప్పి అనేక దఫాలుగా సర్వేలు నిర్వహించి, అర్హులుగాఎంపిక చేసి పదేళ్ల పరిపాలన చేసిన చివరికి ఎంతోమంది అర్హులైన పేదలకి డబుల్ బెడ్ రూమ్ అందించకుండా అన్యాయం చేయడం జరిగిందనీ అన్నారు.

డ్రాలో వచ్చిన వారికి కూడా, కట్టిన డబల్ బెడ్ రూములు అందించకుండా 106 మంది నిరుపేదలకు అన్యాయం జరిగిందని అన్నారు.

అర్హులుగా గుర్తించన 850 మంది నిరుపేదలకు పట్టాలిచ్చి స్థలాలు ఇవ్వకుండా అన్యాయం చేసిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హాయంలో న్యాయం జరుగుతుందని ఆశతో రెండు సంవత్సరాలు గా ఎదురుచూస్తున్నారని అన్నారు. ఇందిరమ్మ కమిటీల పేరుతో,అప్లికేషన్లు తీసుకోవడం వరకే పరిమితం అవుతున్నదనీ అన్నారు. కట్టిన డబల్ బెడ్ రూమ్ కూడా పంపిణీ చేయడం లేదనీ అన్నారు. కబ్జా గురైన వందల ఎకరాలు ప్రభుత్వ భూమిని,స్వాధీనం చేసుకుంటుందని చెబుతున్న ప్రభుత్వం,స్వాధీనం చేసుకున్న భూమి ఇల్లు లేని నిరుపేదలకు ఎందుకు పంపిణీ చేయకుండా ఎందుకు కాలయాపన చేస్తున్నారని ప్రశ్నించారు.

ప్రభుత్వం ఇప్పటికైనా వెంటనే కట్టిన డబల్ బెడ్ రూములు పంపిణీ చేయాలని అదేవిధంగా డ్రాలో రాని వాళ్ళందరికీ మొదటి ప్రాధాన్యత ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు అందించాలని అన్నారు సెప్టెంబర్ 11న కలెక్టర్ ఆఫీస్ వద్ద జరిగే ధర్నాలు ఇందిరమ్మ ఇళ్ల గురించి దరఖాస్తులు పెట్టుకున్న వాళ్ళందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని, ఈ ధర్నా కార్యక్రమానికి సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు బాబు గముఖ్యఅతిథిగా హాజరవుత ‘న్నారని అన్నారు ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రమణ, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎర్రవెల్లి నాగరాజు, సూరం పద్మ,నాయకులు నక్క దేవదాస్,ఎలిగేటి శీను,నాగుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

**-గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 23 ఫిర్యాదులు స్వీకరణ..**

**-జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ మహేష్. బి.గితే తెలిపారు. గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 23 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

## సిరిసిల్ల 17వ బెటాలియన్‌లో పాత వస్తువుల వేలం

**-బెటాలియన్ కమాండెంట్ ఎం. ఐ. సురేష్**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**



17వ పోలీస్ బెటాలియన్ సర్దాపూర్ లోని పాత టైర్లు, బ్యాటరీలు మరియు పాత ఇతర సామాన్లను 09-09-2025 నుండి 10-09-2025 వరకు 10:30 కి బెటాలియన్ హెడ్ క్వార్టర్స్ లో వేలం వేయనున్నట్లు బెటాలియన్ కమాండెంట్ ఎం. ఐ. సురేష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు 87126 57570, 96526 08026 ఫోన్ నంబర్? లను సంప్రదిస్తే పూర్తి వివరాల కోసం బెటాలియన్ సిబ్బంది తెలుజేస్తారని పేర్కొన్నారు.

## దెబ్బతిన్న రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు..

**బలగం టీవీ, బోయినిపల్లి**



బోయినిపల్లి మండలం కేంద్రం నుండి కోదురుపాక వెళ్లే ప్రధాన రహదారి దేశాయిపల్లి గ్రామంలోని వరద కాలువ వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్డు దెబ్బతినటంతో చొప్పదండి శాసనసభ్యులు మేడిపల్లి సత్యం ఆదేశాల మేరకు గుంతలుగా మారిన రోడ్డుపై మట్టి పోసి రాకపోకలకు వీలుగా మార్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం ఇప్పటికే రూ. 35 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి అంచనాలు రూపొందించామని తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే శాశ్వత రోడ్డు నిర్మాణం పనులు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బోయినిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వన్నెల రమణ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎల్లేష్ యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కౌడగాని వెంకటేష్, మాజీ సర్పంచ్ మడిశెట్టి జనార్ధన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏమిరెడ్డి సురేందర్ రెడ్డి, కొనుకటి మధుకర్, దిలీప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బీరు తయారీ కేంద్రాలు వద్దు.. నీరా కేంద్రాలు ముద్దు..

**-మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్**

**బలగం టీవీ, నాగర్ కర్నూల్**

కృత్రిమంగా తయారుచేసే బీరు కేంద్రాలు తెరిచి కులవృత్తుల మీద ఆధారపడిన వారి పొట్ట కొట్టొద్దని సహజ సిద్ధంగా దొరికే నీరా కేంద్రాలను ప్రోత్సహించాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం తర్నికల్ గ్రామ సమీపంలో కృష్ణయ్య గౌడ్ యొక్క ఈత ఖర్జూర వనాన్ని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పరిశీలించి, కృష్ణయ్య గౌడ్ భార్య యాదమ్మ, కుమారుడు పవన్ తో మాట్లాడి ఈతవనంపై వాళ్లు పొందుతున్న ఉపాధిని అడిగి తెలుసుకున్నారు, కేసిఆర్ ప్రభుత్వంలో గీత కార్మికులను అన్ని విధాల ఆదుకున్నామన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే గీత కార్మికులకు గ్రామానికి ఐదు ఎకరాల భూమి ఇవ్వడంతో పాటు గీత కార్మికులకు ఆదాయ మార్గాలు పెంచుతామని చెప్పిన ప్రకారం అమలు చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు.

# మేడారం అభివృద్ధి పనులు వంద రోజుల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి

- **సీఎం రేవంత్ రెడ్డి**
- **మేడారం, బాసర ఆలయాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమావేశం**

**బలగం టీవీ, హైదరాబాద్**

మేడారం అభివృద్ధికి సంబంధించిన పనులు వంద రోజుల్లో పూర్తయ్యేలా ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మేడారం, బాసర ఆలయాల అభివృద్ధిపై ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్షించారు. ఈ సందర్భంగా మేడారం, బాసర ఆలయాల అభివృద్ధికి సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను అధికారులు వివరించగా, మేడారం సమ్మక్క, సారలమ్మ మహా జాతర నాటికి భక్తులకు సౌకర్యంగా ఉండేలా ఆలయాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. మేడారం అభివృద్ధికి సంబంధించి పలు డిజైన్లను పరిశీలించిన ముఖ్యమంత్రి వంద రోజుల్లో అభివృద్ధి పనులు పూర్తయ్యేలా ప్రణాళికలు ఉండాలని అన్నారు. ప్రపంచంలో అతిపెద్ద గిరిజన పండుగకు సంబంధించి నిర్మాణాలు పూర్తిగా సహజ సిద్ధమైన రాతి కట్టడాలతో చారిత్రాత్మకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. భక్తులకు సౌకర్యంగా ఉండేలా ఎంట్రీ, ఎగ్జిట్, పార్కింగ్ వసతులు అన్నీ సక్రమంగా ఉండాలని చెప్పారు.

భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని జంపన్న వాగులో నీరు నిలిచేలా ప్రాంతాల వారిగా చెక్ డ్యామ్‌ల నిర్మాణాలకు ప్రణాళికలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఈ వారంలో మేడారంకు వచ్చి క్షేత్రస్థాయి పరిశీలన చేస్తానని చెప్పారు. దీనితో పాటు బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ దేవాలయ విస్తరణ, అభివృద్ధికి సంబంధించిన ముఖ్యమంత్రి గారు పలు సూచనలు చేశారు. అన్ని దేవాలయాల అభివృద్ధికి సంబంధించి స్థానిక సెంటిమెంట్‌ను గౌరవించడంతోపాటు, స్థానిక నిపుణులు, పూజారుల అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు కొండా సురేఖ గారు, ధనసరి అనసూయ సీతక్క గారు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు గారు, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ గారితో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నేతలు క్షమాపణ చెప్పాలి

**(మొదటి పేజీ తరువాయి)**

బ్యారేజీ నిక్షేపంలా నిలబడి ఉంది. కానీ కాంగ్రెస్ మాత్రం కూలిపోయిందని అబద్ధాలు చెబుతోంది” అని మండిపడ్డారు.

రూ.94 వేల కోట్ల ఖర్చు చేసిన ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి ఎలా సాధ్యమని కేటీఆర్ ప్రశ్నించారు. “మేడిగడ్డలో మూడు పిల్లర్లు, ఏడవ బ్లాక్ పునర్నిర్మాణం చేస్తే సరిపోతుందని ఎన్డీఎస్ఏ రిపోర్టు స్పష్టంగా చెప్పింది. రూ.250%-%300 కోట్లు మాత్రమే ఖర్చవుతుంది. ఈ డబ్బు కూడా తామే పెట్టి పునర్నిర్మిస్తామని ఎల్ %à% టీ ముందుకొచ్చినా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇక్కడ ప్రజాధనం ఎక్కడ వృథా అయింది?” అని ప్రశ్నించారు.

2013లోనే మాజీ సీఎం కేసీఆర్ రూ.1100 కోట్లతో గోదావరి జలాలను కొండపోచమ్మ సాగర్ ద్వారా హైదరాబాద్‌కు తేవాలనే ప్రణాళిక సిద్ధం చేశారని గుర్తుచేశారు. కానీ అదే ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం రూ.7390 కోట్లకు పెంచిందని విమర్శించారు. “ఏడు రెట్లు ఖర్చు పెంచి, మూడు శుద్ధి కేంద్రాలు, ఐదు పంప్ హౌస్‌లు ఎందుకు కడుతున్నారు? ఎవరి లాభం కోసం? కమీషన్లకా? కాంట్రాక్టర్లకా?” అని నిలదీశారు.

“ఖజానాలో పైసలు లేవని సంక్షేమ పథకాలు అమలు చేయడంలేదని చెప్పే ప్రభుత్వం, రూ.7400 కోట్ల ప్రాజెక్టుకు అర్జెంటుగా శంకుస్థాపన ఎందుకు చేస్తోంది?” అని ప్రశ్నించారు. సుంకిశాల రిటైనింగ్ వాల్ కూలిన ఘటనకు కారణమైన కాంట్రాక్ట్ కంపెనీని బ్లాక్ లిస్ట్ చేయమని హెచ్ఎండబ్ల్యుఎస్ఎస్‌బీ రిపోర్ట్ ఇచ్చిందని, అదే కంపెనీకి రూ.7000 కోట్ల పనులు కేటాయించడం దారుణమని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ నేతలు కాళేశ్వరం ప్రాజెక్టుపై అబద్ధాలు ప్రచారం చేసి రాష్ట్ర ప్రజలను తప్పుదారి పట్టించినందుకు వెంటనే క్షమాపణ చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# ఆర్టీసీతో సరోజినీదేవి కంటి ఆస్పత్రి ఒప్పందం

**బలగం టీవీ, హైదరాబాద్**

మరణానంతరం అవయవదాతల నుంచి సేకరించిన నేత్రాలను సకాలంలో ఆస్పత్రికి ఉచితంగా చేర్చేందుకు టీజీఎస్ఆర్టీసీ ముందుకొచ్చింది. ఈ మేరకు హైదరాబాద్‌లోని సరోజినీ దేవి కంటి ఆస్పత్రి, తెలంగాణ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (టీజీఎస్ఆర్టీసీ) మధ్య ఒప్పందం కుదిరింది. సోమవారం సరోజినీ దేవి ఆస్పత్రిలో నిర్వహించిన జాతీయ నేత్రదాన పక్షోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆ ఒప్పంద పత్రాలను టీజీఎస్ఆర్టీసీ ఎండీ వి.సి.సజ్జనార్, సరోజినీ దేవి కంటి ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మోదినీ మార్చుకున్నారు. దీంతో ఇక నుంచి రాష్ట్రంలో ఏ మూలన సేకరించిన నేత్రాలనైనా సరే సకాలంలో ఆస్పత్రికి చేర్చేందుకు వీలు కలుగనున్నది. సేకరించిన నేత్రాలను ఆర్టీసీ వేగంగా ఆస్పత్రి ఐ బ్యాంకుకు చేరుస్తుంది.

# ఆదిలాబాద్ సిమెంట్ కర్మాగారం పునరుద్ధరణకు రూ.2,000 కోట్లు అవసరం

**సీసీఐ అంచనా**

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణలోని ఆదిలాబాద్‌లో ఉన్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిర్వీర్యమైన కర్మాగారాన్ని పునరుద్ధరించి, ఆధునీకరించడానికి సుమారు రూ.2,000 కోట్లు అవసరమని సీసీఐ యాజమాన్యం అంచనా వేసింది. ఈ కర్మాగారం మళ్లీ ప్రారంభమైతే దాదాపు 3,000 మందికి ఉపాధి లభిస్తుందని కంపెనీ అధికారులు తెలిపారు.

సోమవారం సచివాలయంలో జరిగిన సమీక్షా సమావేశానికి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం తరచూ కేంద్రాన్ని ఆదిలాబాద్ యూనిట్ పునరుద్ధరణకు కోరుతూ వస్తోందని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను పలు సందర్భాల్లో కేంద్ర ఉక్కు, భారీసంవత్సరాల పరిశ్రమల మంత్రి హెచ్.డి. కుమారస్వామిని ఈ విషయమై సంప్రదించారని చెప్పారు. త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం పునరుద్ధరణపై సమగ్ర ప్రతిపాదనలు సమర్పిస్తుందని ఆయన తెలిపారు. ఆదిలాబాద్ వంటి వెనుకబడిన జిల్లాలో ఈ ప్రాజెక్టు పునరుద్ధరణ వలన పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుందని మంత్రి తెలిపారు. 2,000 ఎకరాలకు పైగా నాణ్యమైన లైమ్‌స్టోన్ నిల్వలు అందుబాటులో ఉండటం వలన ప్లాంటు ఆర్థికంగా లాభదాయకమని ఆయన స్పష్టం చేశారు. ప్రాజెక్టును ప్రైవేటీకరణ, డిస్‌ఇన్వెస్ట్‌మెంట్ వైపు మళ్లించే ప్రయత్నాలను రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకిస్తుందని హితవు పలికారు.

రాష్ట్రంలో ఉన్న సీపీఎస్‌యూలకు కేటాయించినా వినియోగించని భూములను కేంద్రం తిరిగి ఇవ్వాలని మంత్రి డిమాండ్ చేశారు. సమీక్షా సమావేశంలో తెలంగాణ చీఫ్ సెక్రటరీ ఏ. రామకృష్ణరావు, సీసీఐ సీఎండీ సంజయ్ బంగా, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, మైన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్. శ్రీధర్, డైరెక్టర్ వల్లూరు క్రాంతి, టీజీఐఐసీ ఎండీ శశాంక్ టాండూర్, సీసీఐ ప్లాంట్ జీఎం శరద్‌కుమార్, రీజినల్ మేనేజర్ ఉమేశ్‌కుమార్ సింగ్, మాజీ కేంద్ర మంత్రి వెంకట్రాచారి తదితరులు పాల్గొన్నారు.

# ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు కట్టుబడి

**(మొదటి పేజీ తరువాయి)**

అలాగే డిండీ, ఎస్ఎల్‌బీసీ, పెండ్లిపాకల, నక్కలగండి ప్రాజెక్టుల భూసేకరణను వేగవంతం చేయాలన్నారు. జూరాల ప్రాజెక్టు బ్రిడ్జిపై రోజు రోజుకు ట్రాఫిక్ రద్దీ పెరుగుతున్న దృష్ట్యా ప్రత్యామ్నాయంగా మరో బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి అక్కడి ప్రజాప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన చెప్పారు. వచ్చే మంత్రివర్గ సమావేశానికి ముందే దేవాదుల ప్యాకేజీ3, 6 పనుల పురోగతిపై నివేదిక సమర్పించాలని ఆయన చెప్పారు. ప్రస్తుతం జూరాల, నాగార్జునసాగర్, ఎస్ఆర్ఎస్పీ నిజాంసాగర్, హుస్సేన్‌సాగర్ తదితర ప్రాజెక్టుల్లో పూడిక తీత పనులు ప్రారంభించ బోతున్నట్లు చెప్పారు. ఇప్పుడు చేపట్టిన పూడిక తీత పనుల ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 500 కోట్ల రాబడి ఉంటుందని, రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించినట్టయితే ప్రభుత్వానికి రూ. 3000 కోట్ల నుంచి రూ. 4000 కోట్ల వరకు రాబడి వస్తుందన్నారు. అన్నింటికి మించి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ఎస్-ఎల్‌బీసీ పనుల పునరుద్ధరణకు గాను నిర్వహించతలబెట్టిన హెలిబోర్న్ సర్వేకు రెండు హెలికాప్టర్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. టన్నెల్ సమీపంలో హెలిబోర్న్ ఏరియల్ మాగ్నెటిక్ సర్వే ఏర్పాట్లను మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.




# తలసరి ఆదాయంలో దేశంలోనే తెలంగాణ నెంబర్ 1

- **రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా భావిస్తున్నదని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా పేరిట రూ. 30 వేల కోట్లు రైతుల పక్షాన బ్యాంకులకు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందని గుర్తు చేశారు. సోమవారం హైదరాబాద్‌లో రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతూ బ్యాంకింగ్ రికవరీ చరిత్రలో ఇదొక రికార్డు అని గుర్తు చేశారు. రైతులకు సకాలంలో రుణాలు ఇవ్వండి, ఆస్తుల తాకట్టు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు చేయాలని చెప్పారు. రైతులపై ఒత్తిడి చేయకూడదన్నారు. బ్యాంకర్లు మానవీయ కోణంలో ఆలోచించాలని సూచించారు. మన తెలంగాణ రాష్ట్రం దేశంలో తలసరి ఆదాయంలో (ప్రతి వ్యక్తి ఆదాయంలో రూ. 3.87 లక్షలతో) అగ్రస్థానంలో నిలిచిందన్నారు. కర్నాటక, హర్యానాను అధిగమించి, ఐదేండ్ల తర్వాత తొలిసారి ఈ అగ్రస్థానాన్ని సాధించిందని అన్నారు. వ్యవసాయం పరిశ్రమలు, సేవా రంగం స్థిరమైన వద్ధితో మొత్తంగా తెలంగాణ దేశంలోనే అత్యంత చురుకైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా నిలిచి ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. మనమందరం దీని నుంచి ప్రేరణ పొంది, మన ప్రజల సమగ్ర సంక్షేమం కోసం మరింత కషికి ప్రతిజ్ఞ తీసుకోవాలన్నారు. తెలంగాణ రైసింగ్ లో బ్యాంకర్ల పాత్ర ఉంది ఉన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరపు మొదటి త్రైమాసికంలో బ్యాంకులు ప్రాధాన్య రంగ రుణాల విభాగంలో మంచి ఫలితాలు సాధించటం పట్ల సంతోషంగా ఉందనీ తెలిపారు. ప్రాధాన్య రంగంలో వార్షిక ప్రణాళిక రుణ లక్ష్యాలలో మొదటి త్రైమాసికంలోనే 33.64 శాతం సాధించడం అభినందనీయం అన్నారు. రాష్ట్రం నిరంతరం అధిక రేషియోను కొనసాగించడం గర్వకారణమన్నారు. ఈ త్రైమాసికంలో ఇది 126.50 శాతంగా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా భావించి, పలు పథకాలను అమలు చేస్తోందన్నారు. అర్హులైన రైతులకు రూ. 2 లక్షల వరకు పంట రుణాలు ఉన్నాయన్నారు. వీటి ఫలితంగా వ్యవసాయం, అనుబంధ రంగాల వాటా పెరుగుతోందన్నారు. వీటిలో గణనీయ సంఖ్యలో కిసాన్ క్రెడిట్ కార్డు ఖాతాలు పునరుద్ధరించి, రైతులకు నిధులు విడుదల చేశామన్నారు. వ్యాపారానికి అనుకూలమైన, సజనాత్మక విధానాలు ప్రభుత్వ చొరవల వల్ల రాష్ట్రంలో పెట్టుబడులు పెరిగి, పరిశ్రమల వద్ధి, ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయన్నారు. రైతుల పక్షాన రైతు రుణమాఫీ, రైతు భరోసా పేరిట రూ. 30 వేల కోట్లు రైతుల పక్షాన బ్యాంకులకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించిందని డిప్యూటీ సీఎం తెలిపారు.

# మూసీని ప్రక్షాళన చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

పుడుతున్నారు. గుజరాత్ రాష్ట్రంలో సబర్మతీ, ఉత్తర ప్రదేశ్‌లో గంగా, ఢిల్లీలో యమునా నదుల ప్రక్షాళన చేసుకున్నప్పుడు 4 కోట్ల తెలంగాణ ప్రజలకు సంబంధించిన మూసీ నది ప్రక్షాళన ఎందుకు జరగొద్దు. ఆ జిల్లా ప్రజలతో కలిసి నడిచినప్పుడు ఎలాగైనా సరే మూసీని పునరుజ్జీవింపజేయాలని ప్రజలు కోరినప్పుడు ఆరోజు మాటిచ్చా. మూసీని ప్రక్షాళన చేస్తాం. హైదరాబాద్ నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దుతాం. హైదరాబాద్ ఫ్యాక్టరీల కాలుష్యం మూసీలో కలవకుండా నియంత్రిస్తాం. హైదరాబాద్ నగరానికి గోదావరి జలాలను తరలించాలన్న ప్రాజెక్టుకు మూలం శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు. అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలిస్తున్నాం. గోదావరిపై 2008 లో తుమ్మిడి హెట్టి వద్ద దివంగత వైఎస్ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత - చేవెళ్ల సుజల స్రవంతిని ప్రారంభించారు.

ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు విషయంలో త్వరలోనే మహారాష్ట్ర ముఖ్యమంత్రితో చర్చలు జరుపుతాం. తుమ్మిడిహెట్టి వద్ద 152 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు చేపట్టాలని ప్రతిపాదిస్తే, మహారాష్ట్ర ప్రభుత్వం 142 మీటర్ల ఎత్తు వరకు అభ్యంతరం చెప్పడం లేదు. మహారాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి మధ్యంతరంగా148, 150 మీటర్ల వరకైనా ఒప్పించి ప్రాజెక్టును పూర్తి చేసి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో లక్షన్నర, రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తాం.

గతంలో సంకల్పించినట్టుగా ప్రాజెక్టును పూర్తి చేసి చేవెళ్ల, వికారాబాద్, తాండూరు, పరిగి వరకు వ్యవసాయానికి గోదావరి జలాలను తరలించడం ద్వారా ఈ ప్రాంత రైతాంగాన్ని ఆదుకుంటాం.

ఈ ప్రాజెక్టు రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్నాం. బుద్వేల్ ప్రాంతాన్ని ఒక అద్భుతమైన హబ్‌గా అభివృద్ధి చేస్తాం. గేవ్ వే ఆఫ్ హైదరాబాద్ ప్రాజెక్టు కోసం ప్రణాళికలు సిద్ధం చేశాం. ప్రభుత్వం తలపెట్టిన ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో కలిసిరండి..” అని పిలుపునిచ్చారు.

?? ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు, పొన్నం ప్రభాకర్ గారు, గడ్డం వివేక్ వెంకటస్వామి గారు, స్థానిక శాసనసభ్యుడు ప్రకాశ్ గౌడ్ గారితో పాటు ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రాంత ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సమ్మక్క-సారక్క జాతరకు రూ. 150 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయనున్నారు. విపత్తు నిర్వహణ దళాలు, అగ్నిమాపక సిబ్బంది 24 గంటలు సిద్ధంగా ఉంటారు.

యునెస్కో గుర్తింపు పొందిన ఈ మహా జాతరలో ఆదివాసీ సంప్రదాయాలు, సంస్కృతిక వైభవం ప్రతిఫలిస్తాయి. రాష్ట్ర ప్రభుత్వం ఈ జాతర ద్వారా ఆధ్యాత్మికతతో పాటు గిరిజనుల సాంప్రదాయాలు, సంస్కృతిని దేశానికి పరిచయం చేయాలనే లక్ష్యంతో ముందుకెళ్తోంది. తాత్కాలిక ఏర్పాట్లతో పాటు, భక్తులకు ప్రతిసారి సౌకర్యాలు అందేలా శాశ్వత మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు చేపడతామని మంత్రి తెలిపారు.